# జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆమ్రపాలి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆమ్రపాలి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలి కాట బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీలలో భాగంగా కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్‌రోస్‌ను బదిలీ చేస్తూ ,ఆయన స్థానంలో ఆమ్రపాలికి జిహెచ్ఎంసి కమిషనర్‌గా (ఎఫ్ఏసి)గా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు బుధవారం రోనాల్డ్‌రోస్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలులతోపాటు జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈవిడిఎం కమిషనర్‌గా ఏ.వి.రంగనాథ్ బాధ్యతలు




బాధ్యతలు స్వీకరిస్తున్న ఐపిఎస్ అధికారి ఏ.వి రంగనాథ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** జిహెచ్ఎంపి ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవిడిఎం) కమిషనర్‌గా సీనియర్ ఐపిఎస్ అధికారి ఏ.విరంగనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు బుధవారం బుద్ధభవన్‌లోని కమిషనర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఉద్యోగ బాధ్యతలను కూడా ఎప్పటిలాగానే విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్ వార్త



# వానలొచ్చే... వ్యాధులు తెచ్చే



**-విజృంభిస్తున్న డెంగీ, మలేరియా వ్యాధులు**
**-నెలరోజుల్లో 100కిపైగా కేసులు**
**-బాధితుల్లో మురికివాడ ప్రజలే అధికం**
**-అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు**

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త;** వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో బస్తీలు, మురికివాడ ప్రజలు విపరీతమైన దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన నెలరోజుల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కలిపి 100కిపైగా డెంగీ,మలేరియా కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. ఒక్కనల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలోనే 30కిపైగా డెంగీ కేసులు నమోదయినట్లు సమాచారం. సాధారణంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు ఎక్కువగా కురిసేటప్పుడు డెంగీ కేసులు నమోదవుతాయి. కానీ ఈసారి మేనుంచే కేసులు రావడంతో జనం భయపడుతున్నారు. దీంతో వైద్యశాఖ అధికారులు, బల్దియా ఎంటమాలజీ అధికారులు, పిహెచ్‌సిలు, బస్తీదఖానాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. డెంగీ ర్యాపిడ్‌కిట్లతో పాటు, మందులు సిద్ధంగా ఉంచుతున్నారు. జిహెచ్ఎంసి ఎంటామాలజీ విభాగం కూడా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి నీరునిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా, ఫాగింగ్ చేస్తామని చెబుతున్నారు. అయితే నివారణకు ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా.. కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వలన దోమలను నశింపజేయడం సాధ్యం కావడం లేదు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చేస్తూ.. తూతూమంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అది కూడా అధికారులు, విఐపిలు ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తూ..బస్తీలలో కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోప ణలు వినిపిస్తున్నాయి. దాంతో బస్తీలు, మురికి వాడలకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు దోమ కాటుకి గురై మలేరియా బారీ నపడుతున్నారు.

**డెంగీ..**

నగరంపై డెంగీ వ్యాధి పంజా విసురుతుంది. ముసురుతున్న వాతావరణంతో పాటు వ్యాధులు కూడా ముదురుతున్నాయి. హఠత్తుగా తీవ్రజ్వరం, కాళ్ల కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి. శరీరంపై దద్దుర్లు వస్తాయి. వాంతులు, వికారం, కొన్నిసార్లు రక్తంతో కూడిన మలవిసర్జన, రక్తంలో ప్లేట్‌లేట్స్ తగ్గుదల ఉంటుంది. లక్షణాలు బట్టి వెంటనే చికిత్స తీసుకోవాలి. పూర్తిగా నయం అవుతుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు తెస్తుంది.

**మలేరియా..**

మలేరియా రెండు రకాలు ఉంటుంది. 1) మలేరియా ప్లాస్మోడియం వైవాక్స్(పీవీ), 2) ప్లాస్మోడియం పాల్సీ ఫారమ్(పీఎఫ్). వీటిలో ప్రమాదకరమైనది ప్లాస్మోడియం పాల్సీ ఫారమ్(పిఎఫ్). గతంలో ఇది ఎక్కడో ఆటవి ప్రాంతాల్లో కనిపించేది. కానీ ప్రస్తుతం నగరంలోనూ వ్యాపిస్తుడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వాటి లక్షణాలు ఎలాంఉంటాయంటే... దోమ కుట్టిన 10-14 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది. తలనొప్పి ఒళ్లు నొప్పులు ఉంటాయి. చలి జ్వరం, చెమటలు పట్టడం, కొన్నిసార్లు వాంతులు అవుతాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే ఎలాంటి మందులు తీసుకోకుండా రక్తపరీక్షలు చేసుకోవాలి. మలేరియా అని తేలితే ప్రత్యేక ఔషదాలు అందిస్తారు. పూర్తిగా తగ్గిపోతుంది.

**జాగ్రత్తలు;**

దోమలు వృద్ధి చెందకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. వీటి కాటు బారిన పడకుండా చూసుకోవడం అన్నింటి కంటే చాలా కీలకం. బయటకు వేళ్లేటపుడు కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేసుకోవాలి. ఇంటి కీటికీలు, తలుపులకు దోమలు రాకుండా జాలీలను అమర్చుకోవాలి. చీకటి పడే సమయంలో కిటీకీలు, తలుపులు తెరిచి ఉండకుండా చూడాలి. ఇంట్లో ఉండే కూలర్లు, పూలకుండీల్లో తరచూ నీళ్లు మార్చాలి. వారానికి ఒకసారి పూర్తిగా ఎండిపోయే విధంగా చూడాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికిగుంటలు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు లేకుండా చూడాలి. ఇందులో నీరు నిల్వ ఉంటే డెంగీ దోమలు పెరగడానికి కారణమవుతాయి. వ్యక్తిగత పారిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత అన్నిటి కన్నా ముఖ్యం. బయట నుంచి ఇంట్లోకి వచ్చేటపుడు కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవడం మేలు. ప్రతి రోజూ వేడి ఆహారం తీసుకోవాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. చిన్నపాటి జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలు ఏర్పడిన వెంటనే వైద్యుని తప్పనిసరిగా సంప్రదించాలి.

# పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా జర్నలిస్టు కాలనీ

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త**

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. నిజాంపేట్ జర్నలిస్టుకాలనీ పరిస్థితి. అంగలో స్థలన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా చెంతనే ప్రభుత్వ స్థలాలు ఉన్నా కాలనీవాసుల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోతున్నాయి. పైగా దొంగలు దొంగలు ఊరు పంచుకున్నట్టు ఇక్కడి ప్రభుత్వ స్థలాల్లో కబ్జాదారులు యధేచ్ఛగా ఆక్ర మణపర్వం కొనసాగిస్తూ హారతి కర్పూరంలా కరిగించేస్తున్నారు. ఫలితంగా జర్నలిస్టుకాలనీ వాసుల అవసరాలు మాత్రం ఆమడదూరంలోనే ఉన్నాయి. కాలనీవాసులు ఏదైనా శుభకార్యం చేసుకోవాలన్నా.. సమావేశాలు పెట్టుకోవాలన్నా కాలనీలో కమ్యూనిటీ హాల్‌లేని దుస్థితి. ఫిబ్రవరి 14, 2020న కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం శంకు స్థాపన చేశారే గానీ ఇంతవరకు అది పట్టాలు ఎక్కలేదు. ఇక్కడా శిలాఫలకం అధికారులను వెక్కిరిస్తోంది. పోనీ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలమైనా సరిపోయేంతగా ఉందా? అంటే అదీ లేదు. చిన్నపాటి గది కూడా ఇక్కడ నిర్మించలేని పరిస్థితి. అలాంటిది ఇక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ ఏవిధంగా నిర్మిస్తారో అధికారులకే ఎరుక. తాంబూలాలు ఇచ్చేశాం.. మీరు మీరు కొట్టుకుచావండి అన్న రీతిలో మొక్కుబడిగా కమ్యూనిటీ హాల్‌కు శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జర్నలిస్టుకాలనీలో నివాసాల సంఖ్య పెరగడంతో పాటు జనాభా అంతకంతకూ పెరుగుతోంది. వ్యక్తిగత, గృహాలతో పాటు అపార్ట్‌మెంట్ కల్చర్ ఇక్కడ వేళ్లూనుకుంటోంది. దాదాపు 2,000 పైచిలుకు జనాభా ఉంటుంది. వీరి అవసరాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి.



శిలాఫలకం ( ఫైల్‌ఫోటో )

**ఒక పార్కూ లేదు.. ఒక ప్లే గ్రౌండ్ లేదు..**

కాలనీలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ సౌకర్యం మినహాయించి ఇక్కడ చెప్పుకోవడానికి ఏ ఒక్క అభివృద్ధి జరగలేదు. కమ్యూనిటీహాల్ పరిస్థితి అలా ఉంటే కాలనీవాసులు సాయంత్రం కాసేపు సేదదీరుదామంటే ఆహ్లాదం కరువైంది. పిల్లలు ఆడుకుందామంటే క్రీడా మైదానం లేదు. పార్కు, ప్లేగ్రౌండ్ కోసం ఎక్కడో దూరంలో ఉండే బయట ప్రాంతానికి వెళ్ళాల్సిన అగత్యం ఏర్పడింది. అంత దూరం ఏమి వెళతాం.. అనుకుంటూ ఆటలు, ఆహ్లాదం అన్న పదాలను జర్నలిస్టుకాలనీ వాసులు మర్చిపోయారు. ఒకవైపు నిన్నమొన్న వెలసిన కాలనీల్లో సైతం పార్కులు, ఓపెన్ జిమ్‌లు, ఆట స్థలాలు, కమ్యూనిటీ హాళ్లు.. ఇలా అభివృద్ధి పరంపర కొనసాగుతుంటే.. ఇక్కడ మాత్రం వాటి ఊసే లేదు.

**గుడికి దారి కనుక్కోండి మహాప్రభో..!**

జర్నలిస్టు కాలనీలోని చర్ల ఎల్లమ్మ గుడికి వెళ్ళాలంటే భక్తులకు ఒక ఫజిల్. ఎటువెళ్లాలో అర్థం కాదు. కనీసం అమ్మవారి గుడికి రోడునడ అయినా వేయండి మహాప్రభో..? అంటూ కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నా కనికరించే నాధుడే లేకుండాపోయాడు. గతంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడమే కాకుండా స్థానిక కార్పొరేటర్ చేతుల మీదుగా ప్రారంభానికి కూడా నోచుకున్న ఈ రోడ్డు కొన్ని దుష్టశక్తుల కారణంగా ఆదిలోనే హంసపాదులా మారింది. పోనీ వేరే మార్గంలోనైనా రోడ్డు వేస్తారు అనుకుంటే అది కూడా అమలుకు నోచుకోలేదు. కేవలం గుడి ముందు వరకు వేసిన సీసీ రోడ్డు చూసి మురిసి పోవాల్సిందే తప్ప అసలు గుడికి వెళ్ళాలంటే మా ర్గమే లేక పోవడం బాధాకరం. మరికొద్ది రోజు ల్లో ఆషాఢ మాస బోనాలు ప్రారంభం కానుండగా అమ్మవారికి బోనాలు సమర్పించుకోవాలన్నా, మొక్కులు తీర్చుకోవాలంటే ఆపసోపాలు పడాల్సిందే..

**ముంగిటనే ప్రభుత్వ స్థలం..?**
**ప్రజోపయోగార్థం కేటాయించరేం..?**

జర్నలిస్టు కాలనీ 334 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ స్థలం ఉంది. అయితే కొంతమంది ప్లాట్లుగా చేసి గదులు నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు కూడా ఇక్కడి నిర్మాణాలపై కన్నెర చేసి కూల్చివేతలు కూడా చేపట్టారు. కబ్జాదారులు మళ్ళీ యధేచ్ఛగా నిర్మాణాలు చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతూనే ఉన్నారు. క్రమేపి స్థలం మొత్తం మాయం చేసే దిశగా కబ్జాదారులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని జర్నలిస్టుకాలనీ వాసుల అవసరాల కోసం కేటాయించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్, పార్కు, ప్లేగ్రౌండ్, దేవాలయ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు అయితే తమకెవరు అడ్డు అన్నట్టుగా ప్రభుత్వ స్థలాల్లోనే దేవాలయాల నిర్మాణం జరుపుతున్నారు. వారికి వర్తించని నిబంధనలు తమ కాలనీలో వర్తిస్తాయా ? అన్న ప్రశ్న తలెత్తుతుంది.

# 280 కిలోల గంజాయి పట్టివేత

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** నగరంలో మరోసారి భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి మహారాష్ట్రాకు నకిలీ నెంబర్ ప్లేట్ గల రెండు కార్లల్లో ఎండు గంజాయిని తరలించే క్రమంలో హైదరాబాద్‌లోని చోటుప్పల్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఓటీ పోలీసుల కంట పడింది. 280 కిలోలు ఉన్న గంజాయి దాదాపు రూ.80లక్షలు విలువ చేస్తుందని సమాచారం. ఎల్‌బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం, ఒడిశాకు చెందిన బోసలే అబా మచ్చింద్రా(29), అవినాశ్ శివాజీ రాథోడ్(19), సిద్ధ రామేశ్వర్ పూజారి(27) అనే ముగ్గురు ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడ్డారు. గతంలో ఒడిశా నుంచి మల్కాజ్‌గిరికి భారీ ఎత్తున గంజాయి రవాణా చేసి ఉన్నారు. ఈ అక్రమార్జనలో పెద్ద ఎత్తున డబ్బు రావడంతో, గంజాయి రవాణాని కొనసాగించారు. తాజాగా మరోసారి భారీగా గంజాయి తరలిస్తూ పోలీసుల చేతికి చిక్కారు. ఒడిశాలోని తేజా అనే గంజాయి సప్లైయర్ వద్ద నుంచి నిందితులకు సరుకు అందినట్లు పోలీసులు గుర్తించారు. 280 కిలోల గంజాయి ప్యాకెట్లని నకిలీ నెంబరు ప్లేట్లు ఉన్న కారుల్లో సర్ది, ఒడిశా రాష్ట్రం నుంచి మహారాష్ట్ర తరలించే క్రమంలో హైదరాబాద్‌లో ఎల్‌బీనగర్, చోటుప్పల్ ఎస్ఓటీ పోలీసు బృందాలకు దొరికిపోయారు. నిందితులు ముగ్గురినీ అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి భారీ ఎత్తున గంజాయితో పాటు, రెండు కార్లను, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

# హెచ్‌డిఎఫ్‌సి ఉద్యోగం పేరుతో రూ.20లక్షల టోకరా

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** హెచ్‌డీఎఫ్‌సీ ట్రేడింగ్ విభాగంలో ఉద్యోగాల పేరుతో సైబర్ దొంగలు రూ.20 లక్షలు కాజేసిన వైనం తాజాగా వెలుగు చూసింది. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన గృహిణి(53)కి హెచ్‌డీఎఫ్‌సీలో ఉద్యోగాల ఖాళీలున్నట్లు ఎస్ఎమ్ఎస్‌తో పాటు వాట్సాప్ సందేశం అందగా, అది సైబర్ దొంగల పనని తెలియక ఆమె సానుకూలంగా స్పందించింది. దాంతో ఆమె పేరున ఒక డీమ్యాట్ ఖాతా తెరిచిన సైబర్ నేరగాళ్ళు, హెచ్‌డీఎఫ్‌సీ గ్లోబల్ సర్వీసెస్ వాట్సాప్ గ్రూప్‌లో ఆమెను చేర్చారు. అనంతరం ప్లేస్టోర్ ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ సర్వీసెస్ యాప్‌ని ఆమెతో ఇన్‌స్టాల్ చేయించి, లావాదేవీల జవాబుదారిగా ఒక అసిస్టెంట్ నెంబరిచ్చారు. తొలుత క్రొనాక్స్ వంటి వివిధ షేర్లను సదరు అసిస్టెంట్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన బాధితురాలు, వేరు వేరు బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ చేసింది. అనంతరం ఆమె పెట్టిన పెట్టుబడులకు సాక్ష్యాలుగా స్క్రీన్ షాట్లను వాట్సాప్ గ్రూప్‌లో సదరు అసిస్టెంట్ ఆదేశాల మేరకు పెట్టి, ఇతరులను మోసం చేయడంలో తనకే తెలియకుండా భాగస్వామి అయింది. ఆమె కూడా వేరే బాధితులు పెట్టిన స్క్రీన్ షాట్లు చూసి మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించింది. తొలుత ఆమె పెట్టుబడులు ట్రేడింగ్ యాప్‌లో కనడడంతో, కొంత మొత్తంలో లాభాలు విత్‌డ్రా చేసుకున్న బాధితురాలు, ఇదంతా సైబర్ మోసమని గ్రహించలే కపోయింది. అనంతరం వారం రోజుల వ్యవధిలో మరిన్ని పెట్టుబడులు పెట్టడం కొనసాగించిన ఆమె, ట్రేడింగ్ యాప్ నుంచి డబ్బు ఉపసంహరణ జరగకపోవడం గమనించింది. తనకు ఉద్యోగమిచ్చిన సదరు హెచ్‌డీఎఫ్‌సీ వ్యక్తులతోనూ, అసిస్టెంట్‌తోనూ ఆమె ఈ విషయమై ప్రశ్నించగా, లీగల్ సమస్యలకూ, ట్రాన్సాక్షన్ రుసుముకూ మరి కొంత డబ్బు పెట్టుబడిగా పెడితే తప్ప ఐపీఓ నుంచి ఆమె మొత్తం డబ్బు విత్‌డ్రా జరగదని చెప్పడంతో విడతల వారీగా కొన్ని లక్షలు పంపి ట్రేడింగ్ చేసింది. కానీ డబ్బు ఎంతకీ ఉపసంహరణ కాలేదని తెలిసి సదరు హెచ్‌డీఎఫ్‌సీ వ్యక్తులను కాంటాక్ట్ చేసే ప్రయత్నం చేయగా వారి ఫోన్లు పని చేయకపోగా, వాట్సాప్ గ్రూప్ తొలగించబడింది. అలా బాధితురాలు చేయని ట్రేడింగ్‌కి దాదాపు రూ.20,69,000 పోగొట్టుకుంది. దాంతో మోసపోయినట్లు గ్రహించిన ఆమె నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గత కొద్ది కాలంగా విడతల వారీగా ఆమె నుంచి సైబర్ దొంగలకు డబ్బు బదిలీ అవ్వడంతో, ఆమె డబ్బు కొంత వరకూ మాత్రమే రికవర్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

# జలమండలి ఎండిగా అశోక్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**-ఘనస్వాగతం పలికిన అధికారులు, ఉద్యోగులు**



**హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త**

జలమండలి నూతన మేనేజింగ్ డైరక్టర్‌గా అశోక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.15గంటల సమయంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ప్రస్తుత ఎండిగా విధులు నిర్వహించిన సుదర్శన్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అశోక్‌రెడ్డికి ఇప్పటికే జలమండలితో అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన రెండేళ్లపాటు జలమండలిలో పనిచేశారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో ఆయన జలమండలి ఈడి, ఫైనాన్స్ డైరక్టర్‌గా సేవలు అందించారు. తరువాత 2012-14 వరకు జిహెచ్ఎంసి అదనపు కమిషనర్‌గా పనిచేశారు. 2019లో తొమ్మిది నెలల పాటు మూసి రివర్ ఫ్రంట్ ఎండిగా పనిచేసిన అనుభవం ఉంది. జలమండలి ఎండిగా విధులు నిర్వహించిన సుదర్శన్‌రెడ్డి సాధారణ పరిపాలన శాఖకు బదిలీపై వెళ్లారు. గత యేడాది డిసెంబరు 18న జలమండలి ఎండిగా బాధ్యతలు నిర్వహించారు.

# యువత డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలి

**-రాజేంద్రనగర్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్**
**-వెటర్నరీ కాలేజీలో ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం**




**అత్తాపూర్ జూన్26,ప్రభాతవార్త :** యువత డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని రాజేంద్రనగర్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కాలేజీలో ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును రాజేంద్రనగర్ పోలిసులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు... మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 500 మంది విద్యార్థులతో కలిసి సే నో టూ డ్రగ్స్, సేవ్ లైఫ్ అని నినాదాలతో వెటర్నరీ కాలేజ్ నుంచి డైరీ ఫార్మ్ చౌరస్తా తిరిగి కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలిసులు అధికారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి..

**-అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 26, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ వార్డు ఆఫీస్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, అధికారులతో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనదయాల్ నగర్ నాలా, భరత్‌నగర్ నాలాలకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయని పనులు వేగవంతం చేయాలనీ అధికారుకలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయనీ శానిటేషన్ కూడా జరగడం లేదని, దీనివలన ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని దానిని దృష్టిలో పెట్టుకుని ఇకనైనా అధికారులు స్పందించి నాలా పనులను, డ్రైనేజీ, రోడ్ల పనులు, వీధి దీపాల సమస్యలను దూరం చేయాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్, ఫాగింగ్ పనులపై సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు, పలు అసోసియేషన్ వారు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించి పనులు వేగవంతం చేయాలనీ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి, అధికారఉలు, అసోసియేషన్ సభ్యులు, నాయకకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

# నేడు పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త**

హైదరాబాద్ మహానగరానికి నీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ 2లోని కొండాపూర్ పంప్‌హౌజ్‌లో రెండో పంపు ఎన్ఆర్‌వి వాల్వ్ మరమత్తులకు కారణంగా నీటి నిలిపివేశారు. అదేవిధంగా యుద్ధ ప్రాతిపదిన పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నగరంలో పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. ఎన్‌పిఏ, మిరాలం, బాలాపూర్, మైసారం, బార్కాస్, బోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండి, భోలక్‌పూర్, చిలకలగూడ, తార్నాక, లాలాపేట, బౌద్ధనగర్, మారెడ్‌పల్లి, కంట్రోల్‌రూం, రైల్వేఎస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాస్‌నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట, ఫిరోజ్‌గూడ, గౌతంనగర్, వైశాలీ నగర్, బిఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కపురి కాలనీ, మహీంద్రహిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కనగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రీపురం, మీర్‌పేట, బడంగ్‌పేట, శంషాబాద్ ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఉండనుందని అధికారులు ప్రకటించారు.

# సామాజిక సాంస్కృతిక చైతన్యానికి పేరు వసుందర విజ్ఞాన మండలి

**-అదనపు కలెక్టర్**
**డా. ఏనుగు నరసింహారెడ్డి**

**రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాతవార్త :** సమాజంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని తీసుకురావడానికి గత 31ఏళ్లుగా వసుంధర విజనఆఇన వికాస మండలి చేస్తున్న అవిరళ సేవలు అనితరసాధ్యమన్న అదనపు కలెక్టర్, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి డా. ఏనుగు నరసింహారెడ్డి సంస్థ వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల గొప్ప సాహిత్య సామాజిక సాంస్కృతిక కళాకారుడని, గత 31 సంవత్సరాలుగా ఈరంగా లకు అశేషసేవలందిస్తూ ఎంతోమంది సాహితీ వేత్తలకు అవార్డులతో ప్రోత్సహిస్తూ ఉన్నారని కొని యాడారు. రాష్ట్రంలోని గోదావరిఖని, కరీంనగర్ తదితర జిల్లాల్లో అనేక సాహిత్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారని, ముమ్ముందు మధుకర్ రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సామాజిక సాంస్కృతిక సాహిత్య చైతన్య సభలు నిర్వహించాలని సూచించారు. మండలి వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, దక్కన్‌ల్యాండ్ సంపాదకుడు వేదకుమార్‌లు విశిష్ట అతిథులు నాళేశ్వరం శంకరం, కె.కుమార్, వెంకటరెడ్డి, శంకర్, భూమయ్య, సుమలత, శ్రీధర్‌రెడ్డి తదితరులతో కలిసి సంస్థ 31వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రముఖ వర్ధమాన కవి, సీనియర్ పాత్రికేయుడు తంగెళ్ళపల్లి కనకాచారి తదితరులకు కర్కముత్తారెడ్డి స్మారక కవితా పురస్కారాలు, పలువురికి విద్యాసార్మక, స్ఫూర్తి, కీర్తి పురస్కారాలు ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.



టి.కనకాచారిని కవితా పురస్కారంతో సత్కరిస్తున్న నరసింహారెడ్డి, వేదకుమార్, నాళేశ్వరం శంకరం తదితర అతిథులు

## సృష్టికర్త అనంతప్రాణకోటికి అందించిన ప్రేమ త్యాగాలే అజరామరం

**- తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాతవార్త :**
సృష్టికర్త ఈ అనంత ప్రాణకోటికి అందించిన వరాలే ప్రేమ, త్యాగమని, ప్రాణికోటి ఉద్భవించిన మరుక్షణం ఇవి పుట్టుకొచ్చాయని, ప్రేమ త్యాగాలకు నిలువెత్తు నిదర్శనం అజరామరం నాటకం అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రాణి కోటి తమ జీవన ప్రయాణంలో గాడితప్పినా ప్రేమ త్యాగం మాత్రం తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం జరుగుతూనే ఉందని, ఎక్కడైతే పవిత్రమైన ప్రేమ ఉంటుందో అక్కడ త్యాగం తొంగిచూస్తూనే ఉంటుందని ఈ అజరామరం నాటకం స్పష్టం చేస్తుందని ఆయన వివరించారు. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో ప్రతినెలా నాటకం-ప్రేక్షకుడి వినోదం, నటుడికి ఆనందం-అదే మా బాట మాట నినాదంతో నిర్విఘ్నంగా నాటక ప్రదర్శనల్లో భాగం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 27 గురువారం రాత్రి కళాపీఠ్ హైదరాబాద్ వారి సమర్పణలో వెట్టి హరిబాబు రచన దర్శకత్వంలో రూపొందించిన అజరామరం నాటకం ప్రదర్శింపబడుతుందని, అధిక సంఖ్యలో ప్రేక్షకులు, నాటకప్రియులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం ఆస్వాదించి నాటకరంగాన్ని ప్రోత్సహించాలని డా. కె.వి.రమణాచారి కోరారు.

## డ్రైనేజీ లీకేజీలను పరిశీలించిన కార్పొరేటర్



రామాలయం వీధిని పరిశీలిస్తున్న శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, జూన్ 26 ప్రభాతవార్త:**
డ్రైనేజీ లీకేజీలను సమయానుసారంగా అరికట్టాల్సిన బాధ్యత జలమండలిపై ఉందని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఓల్డ్అల్వాల్ రామాలయం వీధిలో నిత్యం రోడ్డుపై డ్రైనేజీ నీరు పారుతోందని ఫిర్యాదుతో ఆమె అధికారులుతో కలిసి పరిశీలించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండే విధంగా నూతన పైపులైను ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన బిసి సంఘాల నేతలు



బిసి సంఘాలు ప్రతినిధులతో ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 26 ప్రభాతవార్త:**
చొప్పదండి ఎమ్మెల్యే సత్యంను బిసి సంఘాలకు చెందిన ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని దివంగత మాధవి లతకు నివాళులర్పించారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన సత్యంకు భార్య లేని లోటు పూడ్చలేనిదని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రం గౌడ్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, గొడుగు మహేష్ యాదవ్, జూకంటి ప్రవీణ్ కుమార్, పానుగంటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ వీడేది లేదు.. బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటాం..

**-బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి నాయకులు యశ్వంత్**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 26, ప్రభాతవార్త**
బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వెంటే ఉంటామని రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి నాయకులు యశ్వంత్ తెలిపారు. యశ్వంత్ ఎర్రవెల్లిలో వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల యోగక్షేమాలే బీఆర్ఎస్ ఎజెండా అని, ఇలాంటి సమయంలో ఓపిక పట్టాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోవడం వల్ల విద్యుత్, త్రాగునీటి సరఫరా వంటి అనేక అంశాల్లో నష్టం జరుగుతున్నదనే అంశాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. పార్టీలోని అన్ని స్థాయిలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా నేతలకు కెసిఆర్ సూచించారని తెలిపారు. తాము ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారే సమస్యేలేదని కెసిఆర్ వెంటనే ఉంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ భూమి కబ్జాకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ అధికారులు : బిజెపి

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త**
కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న కబ్జాదారులకు ప్రభుత్వ అధికారులు కొమ్ముకాస్తున్నారని బీజేపీ శ్రేణులు ఆరోపించారు. సర్వే నెంబర్ 82, నిజాంపేట్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి నిజాంపేట కార్పొరేషన్ అవసరాలకి సర్వే చేసి, నాలుగు ఎకరాలలో పార్కు చేపట్టారు. కాగా ఒక ఎకరం స్థలంలో గతంలో పలుమార్లు కబ్జాకు గురైన ప్రతిసారి మున్సిపల్, రెవెన్యూ అధికారులు రక్షించారు. ఈసారి వేయి గజాలు కబ్జాపై మున్సిపల్ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా సహకరించడంపై బీజేపి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ, మంగళవారం మున్సిపల్ రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ గ్రామంలో సర్వే నెంబర్ 82లో 5 ఎకరాల స్థలంలో 2019లో ఎమ్మార్వో పంచనామ చేసి కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కి భూమి స్వాధీనం చేయడం జరిగిందన్నారు. ఈ 5 ఎకరాల స్థలంలో దాదాపు 4 ఎకరాల స్థలంలో పార్కుగా తీర్చిదిద్దడమే కాకుండా ఫెన్సింగ్ కూడా వేయడం జరిగిందన్నారు. ఈ ఫెన్సింగ్‌లో కూడా దాదాపు 300 గజాలు బయట వ్యక్తులు ఆక్రమించుకుని ఫెన్సింగ్ తొలగించి బోర్వెల్ కూడా వేయడం జరిగిందన్నారు. ఈ 300 గజాల స్థలాన్ని ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోలేదన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కబ్జా చేసి, సిమెంట్ ఫెన్సింగ్, చిన్న రూమ్ వేసుకోవడం జరిగిందన్నారు. తక్షణమే ప్రభుత్వ భూమి కబ్జాదారుడిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని రక్షించి, ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లకృష్ణ, అమలేశ్వరి, అరుణ్‌రావు, ముఖేష్, పద్మప్రసాద్, ప్రదీప్, ఆంజనేయులు, సోను, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి ఎన్.గోపి రేపటి మైదానం పుస్తకావిష్కరణ



ఎన్.గోపి రేపటిమైదానం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, ఓలేటి, రఘురామ్, సూర్యధనుంజయ, వంగ్రీశేఖరరెడ్డి తదితర అతిథులు

**నాంపల్లి, జూన్ 26 ప్రభాతవార్త :**
ప్రఖ్యాత కవి డా. ఎన్.గోపి రచించిన రేపటి మైదానం కవితా సంపుటిలోని 75 కవితలు ఆయన 60 దశాబ్దాల జీవనయానంలోని మైలురాళ్ళు అని సీనియర్ సంపాదకుడు డా. కె.శ్రీనివాస్ అన్నారు. డా. ఎన్.గోపి మొట్టమొదటగా తంగేడుపువ్వు రచనతో సాహిత్యవేత్తలను, పాఠకులను ఆకట్టుకోవడం ప్రారంభించి నానీల కవితా సృష్టికర్తగా ఎందరో కవులకు ప్రేరణ ఇవ్వడంతో అందరి దృష్టిని తనవైపు మళ్లించుకున్నారన్నారు. ముఖ్యంగా సామాన్య పాఠకుడు కూడా ఆయన పేరును స్మరించుకుంటుంటే అన్నింటికంటేమించిన గొప్ప విషయమన్నారు. ఎన్.గోపి వేమన పద్యాలపై పరిశోధన విశ్లేషణ చేసి నేటితరం వారికి మార్గనిర్దేశం చేశారని, ఆయనొక సాహిత్య విరించి అని డా. ఓలేటి పార్వతీశం ప్రశంసించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ పక్కనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన ప్రముఖ కవి డా. ఎన్. గోపి అమృతోత్సవ సందర్భంగా ఆయన రచించిన 75 కవితల సంపుటి రేపటి మైదానం ఆవిష్కరణ, అంకితోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.శ్రీనివాస్ విశిష్ట అతిథులు ఆచార్య సూర్యాధనుంజయ, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా. ఎస్.రఘు, గౌరవ అతిథులు హర్షవర్ధన, వంశీరెడ్డి, శ్రీరామ్, డా. జె.నీరజ, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి కవితా సంపుటిని ఆవిష్కరించిరి రచయిత ఎన్.గోపిని ఘనంగా సత్కరించి అమృతోత్సవ శుభాకాంక్షలు తెలిపి ప్రతిని సుప్రసిద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అందించి అంకితోత్సవం కావించారు.

## మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

**-ఎన్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్**

**హైదరాబాద్, జూన్ 26,ప్రభాతవార్త:**
మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేస్తే ఊరుకునేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలువాయి ఉషాకిరణ్ హెచ్చరించారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీగూడెం నుంచి ఎదిగి, మంత్రిగా ప్రజా సేవ చేస్తున్న గిరిజన బిడ్డ ఎదుగుదలను ఓర్వలేక దొర అహంకారంతో బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని దాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌పార్టీ తన అధికారిక ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో నిసిగ్గుగా విమర్శలు చేయడం సరికాదన్నారు. "రోజు రోజుకు రెచ్చిపోతున్న ఇసుక మాఫియా" అంటూ సీతక్క ఫోటోలతో తప్పుడు కథనాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. లేదంటే ఆదివాసీ దెబ్బరుచి చూడక తప్పదని హెచ్చరించారు. ఇసుక దందాకు సీతక్కకు, ఆమె సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారాలు ఉంటే బయటపెట్టి బహిరంగ చర్చకు రావాలన్నారు. కావున మంత్రి సీతక్క ప్రతిష్టకు భంగం కలిగే చేష్టలు మానుకోకుంటే " పరువు నష్టం దావా వేయాల్సి వస్తుందని ప్రజాక్షేత్రంలో జనం బీఆర్ఎస్‌కు బుద్ధి మారని బీఆర్ఎస్ పెద్దలకు న్యాయస్థానాల్లో శిక్ష తప్పదని ఉషాకిరణ్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్‌టిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మేడ శ్రీను, ఆదివాసీ విద్యార్థి సంఘం పాపారావు, లంబాడి మహిళా సంఘం కన్వీనర్ నాగమణి, శ్రీను, సురేష్, పాల్యానాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఉషాకిరణ్, మేడ శ్రీను, పాపారావు, నాగమణి తదితరులు

## ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-టీచర్స్ కాలనీలో పర్యటించిన డిసి రవి కుమార్**

**అత్తాపూర్ జూన్26,ప్రభాతవార్త :**
ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ పరిధిలోని టీచర్స్ కాలనీలో డైఎస్‌డబ్ల్యుఎంతో కలిసి రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా శానిటేషన్ టీమ్ పని తీరు,కాలనీ సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 100శాతం ఇంటింటికి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది,ఆర్‌డబ్ల్యుఎస్ సభ్యులను డిసి అభినందించారు. అనంతరం డిసి మాట్లాడుతూ...స్వచ్ఛ రాజేంద్రనగర్ ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎలాంటి సమస్యలను ఉన్న తన దృష్టి తీసుకురావాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపాలన హెల్ప్ డెస్క్ కేంద్రాలు ప్రారంభం**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి, పథకాల కోసం రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో ఐదు ప్రజాపాలన హెల్ప్ డెస్క్ కౌంటర్‌లను ప్రారంభించి రాజేంద్రనగర్ డిసి రవి కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిసి రవి కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రాధారాని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వ్యవహారం నచ్చక యువకుడి హత్య

**బేగంపేట జూన్ 26,ప్రభాతవార్త**
పెళ్లి చేసుకుంటానంటూ తన కోడలిని వేధిస్తున్న యువకుడి ప్రేమ వ్యవహారం నచ్చని యువకుడు మరో ఐదుమంది స్నేహితులతో కల్సి చిన్న నాటి బాల్యమిత్రుడిని దారుణంగా హత్య చేసిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటిగడ్డలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ హత్యతో పాటిగడ్డతో పాటు బేగంపేట లో సంచలనం అయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అడిషినల్ డీసీపీ పి.అశోక్,బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రామయ్య లతో కల్సి డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ వివరాలను వెల్లడించారు. బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ ప్రాంతానికి చెందిన షేక్ ఉస్మాన్(20), మహ్మద్ ఎజాజ్(26)లు చిన్ననాటి నుంచి మిత్రులు. మహ్మద్ ఎజాజ్ మేనకోడలైన నేహాతో షేక్ ఉస్మాన్ ఏడాది కాలంగా ప్రేమలో ఉన్నారు. వీరి ప్రేమ వ్యవహారం తెల్సిన మహ్మద్ ఎజాజ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ప్రేమ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఉస్మాన్ ను ఎజాజ్ హెచ్చరించాడు. దీంతో పాటు వారిరువురే వ్యక్తిగతంగా కల్సుకోకుండా చేయడంతో పాటు నేహా ఫోన్‌లోని ఉస్మాన్ ఫోన్ నెంబర్ ను బ్లాక్ చేసాడు. ఇదే సమయంలో యువతికి వివాహం చేసేందుకు ఆమె తల్లి దండ్రులు సంబంధాలు చూస్తున్నారని తెల్సుకున్న షేక్ ఉస్మాన్ నకిలీ స్నాప్‌చాట్ ఖాతాలను తెరచి ఇద్దరి మధ్య మాటలు ఇంకా కొనసాగుతున్నట్లు సృష్టించడంతో ఆ యువతికి వచ్చిన సంబంధాలు కూడా క్యాన్సిల్ అయ్యాయి. దీంతో ఉస్మాన్ పై ఎజాజ్ మరింత కోపం పెంచుకున్నాడు. మహ్మద్ ఎజాజ్ ఎలాగైన తన మిత్రుడు షేక్ ఉస్మాన్ ను హత్య చేయాలని పథకం వేసాడు. మహ్మద్ ఎజాజ్‌తో పాటు అతని మిత్రులైన మహ్మద్ ఫిరోజ్(24), సాహిల్‌ఖాన్(19), మహ్మద్ ఫజల్ (20), మహ్మద్ రషీద్(18), మరో బాలుడు తో కల్సి మొత్తం ఆరుగురు ఉస్మాన్‌ను హత్య చేసేందుకు అతని ఇంటికి సమీపంలో మంగళవారం రాత్రి కాపుకాసారు. రాత్రి గం 11.40 నిల సమయంలో ఉస్మాన్ తన సోదరితో కల్సి బైకుపై వస్తున్నట్లు గుర్తించి అడ్డగించారు. ఉస్మాన్‌ను కిందకు లాగి కత్తితో దాడి చేసారు. మెడను కోసి అతని శరీరంపై పలు ప్రాంతాల్లో కత్తులతో పొడిచారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉస్మాన్ సోదరిని పక్కకు తోసివేసారు. ఉస్మాన్ చనిపోయినట్లు నిర్ధారించుకొని అక్కడి నుంచి పారిపోయారు. ఈ హత్య విషయం తెల్సిన వెంటనే బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి నేతృత్వంలో ఇన్స్‌పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో సిబ్బందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలియజేసారు. హత్య కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## వీడిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ హత్య మిస్టరీ

**అల్వాల్, జూన్ 26 ప్రభాతవార్త:** నమ్మకంగా పని చేస్తున్నట్లు నటిస్తూనే డబ్బు కోసం యజమానిని హత్య చేశాడు. డబ్బు, ఎటిఎం కార్డు, బంగారం, స్కూటర్‌ను దొంగిలించి జల్సాలు చేస్తున్న నిందితుడిని చాకచర్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు అల్వాల్ పోలీసులు. హత్యకు సంబంధించి వివరాలను పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు మీడియాకు వివరించారు. ఈ నెల 14వ తేదీన అల్వాల్ కానాజీగూడా ఇందిరా నగర్‌లో నివసించే క్యాటరింగ్ వ్యాపారి అన్వర్ మిర్జా(45) హత్యకు గురయ్యాడు. 13వ తేదీన బంధువు చనిపోయిన నేపథ్యంలో అన్వర్ కుటుంబ సభ్యులు మొత్తం మధ్యప్రదేశ్‌కు వెళ్ళారు. హత్యకు సంబంధించిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ జరిపారు. అన్వర్ మిర్జా వద్ద నమ్మకంగా పని చేస్తున్న ఉత్తరాఖాండ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ రాయల్(33) నడవడికపై పోలీసులకు అనుమానం కలిగింది. సీసీ ఫుటేజీలు, ఫోన్ రికార్డింగ్‌లు తదితర టెక్నికల్ ఆధారాలను సేకరించారు. మిర్జాను హత్య చేసింది మనోజ్ రాయల్‌గా నిర్ధారించుకున్నారు. హత్య అనంతరం బాధితుడి వద్ద ఉన్న ఎటిఎం కార్డు, స్మార్ట్ ఫోన్, హోండా యాక్టీవా తస్కరించాడు. ఎటిఎం కార్డుతో రెండు లక్షలు వరకు డ్రా చేశాడు. నిందితునికి ఎటువంటి అనుమానం రాకుండా పోలీసులు విచారణ పూర్తి చేశారు. రాయల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వ్యసనాలకు బానిస అయిన కారణంగా డబ్బు కోసం యజమానిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అన్వర్‌కు పీకలు దాకా మద్యం తాగించి గొంతు నులిమి రాయల్ హత్య చేశాడు. కేసు విచారణలో ఎంతో చకచక్యంగా వ్యవహరించిన అల్వాల్ పోలీసు సిబ్బందిని ఎసిపి అభినందించడం జరిగింది. నిందితుడి వద్ద నుంచి ఎటిఎం కార్డు, ఫోన్, స్కూటీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోర్జరీ పత్రాలతో రుణాలు తీసుకున్న బ్యాంక్ మేనేజర్లు అరెస్ట్

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :**
పనిచేస్తున్న బ్యాంక్‌లోనే పోర్జరీ పత్రాలతో రుణాలు తీసుకుని ఎస్‌బిఐ బ్యాంక్‌ను మోసం చేసిన ఇద్దరు బ్యాంక్ మేనేజర్లను ఉప్పల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ గణేష్‌నగర్‌లోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ సైదులు 41 వ్యక్తి గత రుణాలు కావాలని వచ్చిన పలువురు నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి వారి పేరుతో రుణాలు తీసుకుని అకౌంట్‌లో డబ్బులు వేసిన తర్వాత వాటిని తిరిగి తన భార్య షేక్ సుష్మ అకౌంట్‌లోకి మళ్లించినట్లు తెలిపారు. సైదులు స్నేహితుడైన మరో బ్యాంక్ మేనేజర్ గంగా మల్లయ్య భగీరథ 41 వద్దకు మరికొన్ని పత్రాలు పంపించి ఇద్దరు కలిసి పలువురు అకౌంట్ల నుంచి సుమారు రూ.3 కోట్ల 28లక్షల 80 వేలు డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. బ్యాంక్ నిధులు దారి మళ్లించి ఎస్‌బిఐ బ్యాంక్‌ను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. మొదట పోలీసులు సిసిఎస్‌లో కేసు నమోదు చేయగా, అనంతరం ఉప్పల్‌కు బదిలీ చేశారు. పోలీసులు విచారణ చేసి బుధవారం బ్యాంక్ మేనేజర్లు షేక్ సైదులు, గంగా మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సైదులు భార్య సుష్మపై కూడా కేసు నమోదు చేశామని, విచారణ సాగుతుందని తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట జూన్ 26,ప్రభాతవార్త**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన తులం బంగారం హామీని అమలు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి కింద 122,షాదీముబారక్ కింద 37మందికి మొత్తం 159మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పేద,మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేయాలనే సదుద్దేశ్యంతోనే తెలంగాణా ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల పెండ్లికోసం ఆయా కుటుంబాలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికి అండగా నిలవాలనే ఆలోచనతో నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ కింద లక్ష 116 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి,కుర్మహేమలత,చీరె సుచిత్ర,దీపిక,మాజీ కార్పొరేటర్ ఆకుల రూపా,తహశీల్దార్ పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగౌడ్ కుటుంబసభ్యులను పరామర్శించిన తలసాని.**



సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్న తలసాని.

బేగంపేట బీ ఆర్ ఎస్ నాయకులు యాదగిరి గౌడ్ ఈ నెల 17వ తేదీన మరణించారు. బుధవారం బీఆర్ఎస్ నాయకుడి కుటుంబాన్ని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని పరామర్శించారు. బేగంపేట లోని యాదగిరి గౌడ్ నివాసానికి చేరుకున్న ఆయన యాదగిరి గౌడ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి, డి.వి.నరేందర్‌రావు నాయి,సీ. సత్యనారాయణ, యాదగిరి గౌడ్ కుమారులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌కో,జెన్‌కో సిఎండిని కలిసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు



సిఎండీ రోనాల్డ్‌రోస్‌కు మొక్కను అందజేస్తున్న అంజయ్య, పరమేష్, అనురాధ తదితరులు

**హైదరాబాద్, జూన్ 26,ప్రభాతవార్త:**
తెలంగాణ ట్రాన్స్‌కో,జెన్‌కో సిఎండీగా బాధ్యతలు స్వీకరించిన ట్రాన్స్‌కో,జెన్‌కో సిఎండీ రోనాల్డ్ రోస్‌ను విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు బుధవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సిఎండీని కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నాసర్ షరీఫ్, జాయింట్ సెక్రటరీ వి.పరమేష్, ఉమెన్ సెక్రటరీ సిహెచ్ అనురాధ, జాయింట్ సెక్రటరీ స్వామి, టిజిఎస్‌పిడిసిఎల్ కంపెనీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, టిజిజెన్‌కో కంపెనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి

**-జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్**



కృష్ణగౌడ్‌ను అభినందిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్,జూన్ 26,ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. ఈమేరకు బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కృష్ణగౌడ్‌ను మైనార్టీ అధ్యక్షులు మాసిన్ షరీఫ్‌తోపాటు పలువురు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ అంబర్‌పేట్‌లో నియోజవకర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింతగా అభివృద్ధి చెందాలంటే ప్రతికార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని కొత్తపాత తేడా లేకుండా పార్టీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అంబర్‌పేట్ మైనార్టీ అధ్యక్షులు మోహిద్ అలీమ్ యూసుఫ్, స్థానిక నాయకులు మహమ్మద్ అలీ, వాజిద్, అమీర్, బషీర్ పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు రూ.10.లక్షల బీమా కల్పించాలి

**- జిల్లా కార్యదర్శి రుద్ర కుమార్ యాదవ్**



తెలంగాణ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్‌లో చేరుతున్న నార్సింగి ఆటో కార్మికుల దృశ్యం

**నార్సింగి, జూన్ 26 ప్రభాతవార్త :**
ఆటో కార్మికులకు రూ.10.లక్షల భీమా సౌకర్యం కల్పించాలని రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజుల రుద్ర కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం నార్సింగి ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ఫెడరేషన్‌లో చేరారు. ఈ సందర్భంగా రుద్ర కుమార్ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వలన ఆటో కార్మికులు గిరాకులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫైనాన్స్‌లలో ఆటోలు తీసుకు వచ్చిన వారు నెలసరి ఇఎంఐలు కట్టలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆటోలకు పర్మినెంట్ అడ్డాలను చూపించకుండా ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని కోరారు. సిఐటియు కార్మికుల కోసం పోరాడుతుందని, వారి ఇబ్బందులు పరిష్కారమయ్యేంత వరకు అండగా నిలుస్తుందన్నారు. కార్మికులంతా ఐక్యతతో ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు స్వచ్ఛందంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, నాయకులు డప్పు ప్రవీణ్ కుమార్, కుమార్, యాదగిరి, రాకేష్, నారాయణ, సుధాకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## చెయిన్ స్నాచర్ అరెస్టు....రిమాండ్

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ మెడలో నుండి బంగారు మంగళ సూత్రాన్ని తెంపుకొని పరారైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన మహ్మద్ ఓసామా (24) ఇటీవల బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఫతే దర్వాజాలో నివాసం ఉంటున్నాడు. అయితే చెడు అలవాట్లకు బానిసైన ఒసామా దొంగతనాలు చేసి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంలో ఈ నెల 21వ తేదీన మీర్‌పేట్ పిఎస్ పరిధిలోని బడంగ్‌పేట్ ప్రాంతంలో కిరాణా షాపు వద్ద మాటు వేసి ఓ మహిళ మెడలో నుండి చెయిన్‌ను స్నాచ్ చేసి సహచరునితో కలిసి మోటార్ సైకిల్ పై పరారయ్యాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో రంగంలో దిగిన పోలీసులు ఒసామాను అరెస్టు చేసి రూ.10 వేల నగదుతో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్ చేశారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించండి

**-బిఎన్‌కేఎస్ఎస్ జాతీయ వైస్ ఛైర్మన్ రామచందర్‌యాదవ్**



శేరిలింగంపల్లి తహశిల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

**శేరిలింగంపల్లి, జూన్ 26 ప్రభాతవార్త**
అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలను ఇవ్వడమే కాకుండా, మియాపూర్‌లోని సర్వేనంబర్ 100,101లోని ప్రభుత్వ భూమిని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్లస్థలాలను మంజూరు చేయాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షులు అనంతయ్య,భవన నిర్మాణ కార్మిక సేవా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి తహశిల్దార్,డిప్యూటి కలెక్టర్ వెంకారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీఎన్‌కేఎస్ఎస్ అధ్యక్షులు, అనంతయ్య, జాతీయ ఉపాధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. అత్యంత విలాసవంతమైన,ఎంతైన భవనాలను నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మికులు చిన్నచిన్న రేకుల ఇళ్లల్లో కిరాయికి ఉంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. కష్టించి పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇళ్లకలను నెరవేర్చేందుకు అధికారులు, ప్రభుత్వ పాలకులు చొరవచూపాలన్నారు. ఈ విషయమై 12ఏళ్లుగా అధికారులకు, రాజకీయ నాయకులకు పలు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితంలేదని వాపోయారు. రాజధాని నగరంలోనే కాకుండా శివార్లలో కూడా ఇంటిఅద్దెలు విపరీతంగా పెరిగి సామాన్యులు నివాసముండేందుకు కష్టమవుతుందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లను కెటాయించాలని, అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు ఇంటిస్థలాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల రెవెన్యూ తహశిల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్య క్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు సతీశ్,పప్పుల లక్ష్మీనారా యణ,వెంకన్న, ఉప్పరి కృష్ణయ్య,మాచనపల్లిమల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవయ్యనగర్ బస్తీ కమ్యూనిటీ హాల్ పూర్తి చేస్తాం

**-కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి సంజీవయ్యనగర్ బస్తీలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వివిధ శాఖ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, జిహెచ్ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీత,వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నిర్మాణ దశలోఉండి ఆగిపోయిన సంజీవయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌ను పర్యవేక్షించారు. త్వరలో జరిగే జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలపై ప్రశ్నిస్తామని, ఇందులో భాగంగా సంజీవయ్యనగర్ కమ్యూనిటీ హాలన నిర్మాణం కోసం నిధులను కేటాయించడంతో పాటు అదనపు నిధులను సమకూర్చుకుని మరిన్ని హంగులతో నిర్మాణం పనులను పూరినత చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు ఆకుల సురేందర్, జ్ఞానేశ్వర్, స్థానిక బస్తీ వాసు లు పాల్గొన్నారు.

## వీణావిద్వాంసురాలు ఏఎస్.మాధురికి సత్కారం



డాక్టర్ ఏఎస్.మాధురిని సత్కరిస్తున్న డాక్టర్ వేణుగోపాలచారి

**చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, గాయకుడు టి.రామోజీ ఆధ్వర్యంలో వీణావిద్వాన్, సుప్రసిద్ధ వీణా విద్వాంసురాలు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్(వీణ) డాక్టర్ ఏఎస్. మాధురికు అభినందన సత్కారకార్యక్రమం జరిగింది. సభలో నిర్మాత, దర్శకులు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రముఖ న్యాయవాది బి.చక్రపాణి, గాయకుడు సుబ్బిరెడ్డి, పురుషోత్తమ్, డాక్టర్ కెఎస్‌వి‌ఎస్.ప్రసాద్, కామేశ్వరరావు, ఆర్‌వి.సుబ్రహ్మణ్యం, గాయనీమణులు నాగమణి, లక్ష్మీగోపాల్, కరుణ, ఆనందలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు గాయకుడు టి.రామోజీ స్వరసారధ్యంలో 'శంకరా.. నాదశరీరాపరా...వేదవిహారా హరా...జీవేశ్వరా' పేరుతో తెలుగు హిందీ సినీసంగీతవిభావరి అందరిని అలరించింది.

## ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో బస్తీ దవాఖానలలో ప్రజల ఇబ్బందులు : కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్



బస్తీ దవాఖానాలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, జూన్ 26 ప్రభాతవార్త:** బస్తీ దవాఖానలపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బందులకు లోనవుతున్నారని కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ ఆరోపించారు డివిజన్ పరిధిలోని బిజేఆర్‌నగర్ బస్తీ దావఖాన మూతపడుతుందని ప్రచారం సాగడంతో ఆయా కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బస్తీ ధావఖానకు చేరుకున్నారు. ఇక్కడ సిబ్బంది లేకపోవడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథ స్వామితో ఫోన్లో మాట్లాడారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ ఈ నెల 3తేది నుండి అందుబాటులో లేదని తెలిపినప్పటికీ ఆయన సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. అనంతరం బస్తీ దావఖాన స్థానిక పర్యవేక్షణ అధికారి కపూర్ వచ్చి ఇక్కడ పని చేసే డాక్టర్ లాంగ్ లీవ్‌లో ఉన్నారని తెలుపగా కుషాయిగూడలో ఎలా పని చేస్తున్నారని కార్పొరేటర్ అడగడంతో నేటినుండే వస్తన్నారని కపూర్ సమాధానం చెప్పడం ఆశ్చర్యానికి లోనయ్యారు. లాంగ్ లీవ్‌లో ఉన్న అధికారి కుషాయిగూడలో పని చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయం జిల్లా అధికారి రఘునాథస్వామికి తెలియదా అని కార్పొరేటర్ డా.కపూర్‌ను అడగ్గా అతనేమి సమాధానం చెప్పలేక పోయారు. బస్తీ దావఖానాల పని తీరుపై జిల్లా అధికారి ఏనాడూ కూడా పర్యవేక్షణ చేసి ఉండరని, వీటిపై వచ్చిన వార్తలను కూడా పట్టించుకోకుండా ఎవరైనా ఆయన దృష్టికి తీసుకెళ్తే డాక్టర్లు సెలవు తీసుకోకూడదా అంటూ ఎదురు ప్రశ్నించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. బిజేఆర్‌నగర్‌లో పని చేసే వైద్యాధికారి ఏనాడు కూడా సరైన విధులు నిర్వర్తించకపోవడం పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తాను పట్టించుకోకపోవడం, ఇలాంటి విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లినప్పుడు వాటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా తాను ఏమి పట్టించుకోకుండా వ్యవహరించడంతోటే ఈ విధమైనటువంటి పరిస్థితి నెలకొందని కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రఘునాథస్వామితో మాట్లాడే క్రమంలో బస్తీ దావఖాన మూసి వేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుండి ఇబ్బందులు ఎదురైనప్పుడు ఉన్నతాధికారిగా తాను కలెక్టర్ దృష్టికిగాని, పోలీస్‌ల దృష్టికి గాని తీసుకెళ్లాల్సిన డిఎం అండ్ హెచ్‌ఓ నిర్లక్ష్యం చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించి బస్తీ దావఖానలను సక్రమంగా నడిపించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించడంతోపాటు మంత్రి దృష్టి కూడా తీసుకెళ్లాల్సి ఉంటుందని ఆయన చేయించారు.

## మైనర్లు వాహనాలను నడపరాదు : ఎసిపి



విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎసిపి శంకర్‌రాజు

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త:** మైనర్లు వాహనాలను నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని ట్రాఫిక్ ట్రైనింగ్ ఎసిపి శంకర్‌రాజు పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లోని సాకేత జూనియర్ కళాశాలలో ట్రాఫిక్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలు వాహనాలను నడపరాదని అది చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే వాహన యజమానికి రూ. 25 వేల జరిమానాతోపాటు 3 సంవత్సరాల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందన్నారు. దీంతో వాహన రిజిస్ట్రేషన్ సంవత్సరంపాటు రద్దు చేయబడుతుందని, వారు పై చదవులకు వీసా, పాస్‌పోర్టు జారీ కాదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. చాలా మంది యువత మత్తు పదార్థాలు, మద్యానికి అలవాటు పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. కళాశాలలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేయరాదని అవి చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్స్ శ్రీధర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాపై కక్షతో ఆస్తులు కాజేయడానికే అక్రమ కేసులు : కార్పొరేటర్ నరేంద్రకుమార్



వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** తాను ఎలాంటి రియల్ ఎస్టేట్ మోసానికి పాల్పడలేదనీ తన ఆస్తులను కాజేయడానికే సహ భాగస్వాములు కుతంత్రాలు చేసి తనపై తప్పుడు కేసులు నమోదు చేయించారని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేంద్ర కుమార్ అలియస్ నందు స్పష్టం చేశారు. జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తనపై జరిగిన కుట్రను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యవహారంలో తానే బాధితుడినని తెలిపారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి, తన భాగస్వాములు కుమ్మక్కై తనను అక్రమకేసులో ఇరికించారని పేర్కొన్నారు. గత 6 సంవత్సరాలనుండి తాను వారితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాననీ ఇందులో కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టానని ఆయన వెల్లడించారు. దాదాపు రూ.31.28 కోట్ల రూపాయలను తాను వారి ఖాతాల్లో వేశాననీ వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో తాను వారిపై కేసులు పెట్టాననీ అందుకు సంబంధించి ఎఫ్ఐఆర్ కూడా అయ్యాయ ని తెలిపారు. ఈ నేపథ్యంలో తనపై కక్ష పెంచుకోవడమే కాకుండా కోట్లాది రూపాయల తన డబ్బులను ఎగ్గొట్టడానికి పథకం పన్ని తనపై భూముల వ్యవహారంలో అక్రమ కేసులు పెట్టించారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే తన స్వంత ఆస్తుల డాకు య్మెంట్లు తన సహ భాగస్వాములైన ఇద్దరు పెద్ద మనుష్యుల వద్ద ఉన్నాయని ఆయన అన్నారు. నా పేరు మీద 80 ఎకరాల భూమి ఉందనీ అయితే ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయలేదని ఆయన వెల్లడించారు. హై కోర్టులో వారిపై రిట్ పిటిషన్ వేశానని ఆయన అన్నారు. తనను బ్లాక్‌మెయిల్ చేసి తన ఆస్తులు కాజేయడానికే తనను కేసుల్లో ఇరికించారని కార్పొరేటర్ నందు తెలిపారు. ఈ విషయంలో తాను న్యాయ పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా ముగిసిన శ్రీ హరిహర క్షేత్రం వార్షికోత్సవ వేడుకలు



శివకేశవుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త:** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రం 65వవార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. రెండు రోజులపాటు వార్షికోత్సవ వేడుకలను కనులపండవుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ ఉదయం మూల విరాట్టుకు అభిషకం, ఉపనిషత్ పారాయణములు, సాయంత్రం శివకేశవుల కళ్యాణ మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేసారు. ఆలయ అర్చకులు కాసుల చంద్రశేఖర శర్మ, మంగళగిరి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మార్తండరావు, సభ్యులు శెట్టి విజయ్‌కుమార్, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన : ఎసిపి శ్రీనివాసరావు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎసిపి శ్రీనివాసారావు, సిఐ లక్ష్మిమాధవి, సూర్య నాయక్ తదితరులు

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల నివారణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఉప్పల్ ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసారావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఉప్పల్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎసిపి శ్రీనివాసారావుతోపాటు, సిఐలు లక్ష్మి మాధవి, సూర్యనాయక్, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎసిపి శ్రీనివాసారావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ద తీసుకోవాలని, మద్యం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఆటోడ్రైవర్లు తమకు నిర్ణయించిన ప్రాంతంలోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ ప్రజలకు సేవలు అందించాలని కోరారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, ఇతర సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలే మా ఎజెండా : సునీల్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సునీల్ తదితరులు

**తుర్కయంజాల్, జూన్ 26 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు వశిష్ట ఎన్‌క్లేవ్ కాలనీలో 13 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు కౌన్సిలర్, టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డిల సహకారంతో వార్డులో మౌలిక వసతులు సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్, ఇంటింటికి మంచినీళ్లు, విద్యుత్ వీధిలైట్లు, కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్రు, దశరథ్, శ్రీకాంత్, శ్రీనివాస్, మల్లేష్, రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి : చైర్మన్ నల్ల రఘుమారెడ్డి



క్యూ లైన్లను పరిశీలిస్తున్న చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** భక్తులకు మరింత మరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. దేవాలయంలోని ప్రసాద విక్రయాల కౌంటర్ల ముందు దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఆనంద్ కుమార్‌గౌడ్, మేకల యాదగిరి, గౌడూరు మధుసూధన్‌రెడ్డి, మేక సురేందర్ రెడ్డి, ముద్ద కళ్యాణ్, బీసుకుంట్ల సతీష్ గౌడ్, చేగోని సురేష్‌గౌడ్, చీర తిరు మలేష్, దేవాలయ సిబ్బంది శ్రీనివాసరావు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాటా అశోక్‌గౌడ్‌కి నేతల నివాళి

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** కొత్తపేటడివిజన్ బిజెపి మాజీ అధ్యక్షుడు కాటా అశోక్‌గౌడ్ బిజెపికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కాటా అశోక్‌గౌడ్ వర్ధంతి కార్యక్రమం బుధవారం నాగోల్ అనంతుల అంజిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించగా బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బిజెపి జాతీయ నాయకుడు శేఖర్‌జి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు నాయికోటి పవన కుమార్, బద్దం ప్రేమమహేశ్వర్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, బిజెపి రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, నాయకులు బొల్గం యశ్పాల్‌గౌడ్, వజీర్ కుమార్‌గౌడ్, నీరంకి రవి, దాసరి జయప్రకాష్, లింగాల రాహుల్‌గౌడ్, మంచి రాజేష్ పాల్గొని అశోక్‌గౌడ్‌కు నివాళులర్పించారు.

## రోడ్లపై నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు : డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు



నిర్మాణ వ్యర్థాలు వేసే వ్యక్తుల సమాచారం ఇచ్చిన వారికి నగదు రివార్డు అందజేస్తున్న కమిషనర్ అంజనేయులు తదితరులు

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో రోడ్డు పక్కన నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటి కమిషనర్ అంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలో రోడ్డు పక్కన నిర్మాణ వ్యర్థాలు వేసిన రెండు ట్రాక్టర్లను అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే ట్రాక్టర్ డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లకు నిర్మాణ వ్యర్థాలు వేయవద్దని అవగాహన కల్పించామని, మొదటిసారి పట్టుబడిన వారికి రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు, మూడోసారి పట్టుబడితే పోలీస్ కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు. వ్యర్థాలు వేసే వ్యక్తుల సమాచారం ఇచ్చిన వారికి రూ.వెయ్యి నగదు బహుమతి అందజేస్తున్నామని తెలిపారు. రాత్రి డ్యూటిలో ఉన్న శానిటరీ జవాన్ మారయ్య, కిష్టయ్య అనే వ్యక్తి వ్యర్థాలు వేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతనికి బహుమతి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ డిఇ చందన, శానిటరీ సూపర్‌వైజర్లు రాజశ్వేర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ లలితనగర్‌కాలనీలోని శ్రీరమాసమేత శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైవోపేతంగా నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా లక్ష్మీనారాయణ హోమం, లక్ష పుష్పార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి బుధవారం హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ కార్పొరేటర్‌ను సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ ఊర నరసింహగుప్తా, మార్గం రమేష్, సూరిసెట్టి వీరేశం, బచ్చు సత్యనారాయణ, పాల్తి శ్రీనివాస్, చిదర నాగేందర్, ప్రొద్దుటూరి కుమారస్వామి, వక్కలంక శ్రీనివాస్‌రావు, కిషన్, అశోక్‌గుప్తా, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, రఘునందన్ జోషి, టీంకు, భక్తులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై నేరేడ్‌మెట్ పోలీసుల అవగాహన సదస్సు, ర్యాలీ..

**నేరేడ్‌మెట్, జూన్ 26 ప్రభాతవార్త:** నేరేడ్‌మెట్ పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై బుధవారం హెల్లెన్ కిల్లర్ విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి నేరేడ్‌మెట్ శ్రీ కాలనీ నుండి నేరేడ్‌మెట్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందని నేరేడ్‌మెట్ సీఐ పేర్కొన్నారు. నేటి యువత చెడువ్యసనాల బారిన పడకుండా మంచి జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా తెలిపారు. సుమారు 150నుండి 200మంది విద్యార్థులతో ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది, హెల్లెన్ కిల్లర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సిసి రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గడ్డిఅన్నారం డివిజన్ శ్రీకోదండరాంనగర్ కాలనీలో సిసి రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరిచూసుకుంటూ వీలైనంత త్వరగా సిసిరోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, ప్రధానకార్యదర్శి ఏనుగు శ్రీధర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, కరీం, రఘునందన్‌జోషి, టీంకు, తదితరులు పాల్గొన్నారు.


## ఎస్ఎస్ఎల్ఆర్ కమిషనర్‌ను కలిసిన గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు



కమీషనర్‌ను సన్మానిస్తున్న గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్ఎస్ఎల్ఆర్) కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోతి బుద్ద ప్రకాష్‌ను తెలంగాణా గజిటెడ్‌ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నరహరిరావు, కార్యదర్శి రాంచందర్, కోశాధికారి శ్రీరాం, ఆర్.కేశవులు, ఉపాధ్యక్షుడు ఎం.నాగేందర్, సంయుక్త కార్యదర్శి ఐనేష్‌లు పాల్గొన్నారు.

## తుర్కయాంజాల్ పరిధిలో వీధి కుక్కలతో ప్రజలు భయాందోళన : గ్యార మల్లేష్



కుక్కల బెడదనుండి కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బిఎస్పీ నాయకులు

**తుర్కయంజాల్, జూన్ 26 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ పరిధిలో కుక్కల స్వర విహారం ఎక్కువగా ఉందని బిఎస్‌పి తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటీ కోశాధికారి పట్నం రమేష్ కురుమ, గ్యార మల్లేష్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుర్కయంజాల్ పరిధిలో కుక్కల స్వైర విహారం ఎక్కువగా ఉందని దీంతో పిల్లలనుండి పండు ముసలి వరకు వెంటాడి కరుస్తాయని తక్షణమే కుక్కల బెడద నివారించాలని మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంతుక సైదులు, రాజు, నెమలి సత్యం, వస్పరి తిరుమల్, నరేష్, అబ్దుల్లాపూర్మెట్ మండల అధ్యక్షులు చిత్రం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.కె పురం బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలి



అధికారులతో కలసి కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, జూన్ 26 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కొరకు తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గపరిధిలోని నేరెడ్‌మెట్ డివిజన్ ఆర్.కె పురంలో ఆయన ఆర్.కె పురం బ్రిడ్జి, పరిసర కాలనీల్లో ఆయన కార్పొరేటర్ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.కె పురం బ్రిడ్జికి మరమ్మతు పనులు, బ్రిడ్జి సమాంతరంగా మరో బ్రిడ్జిని నిర్మించాలని మున్సిపల్, రైల్వే అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. మున్సిపల్, రైల్వే, సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. త్వరగా ఆర్.కె పురం బ్రిడ్జి సమాంతరంగా మరో బ్రిడ్జి పనులు ప్రారంభమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారి సుధాకర్, మున్సిపల్ ఇఇ రాజు, డీఇ రేణుక, నాయకులు జి.కె హన్మంత్‌రావు, రావుల అంజయ్య, చిందం శ్రీనివాస్, రాముయాదవ్, వెంకన్న, శ్యామ్, రాజేష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం : రాచకొండ సిపి తరుణ్‌జోషి



ఆర్థిక సహాయం అందిస్తున్న రాచకొండ సిపి తరుణ్ జోషి..

**నేరెడ్‌మెట్, జూన్ 26 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఎస్.బి బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల బ్రెయిన స్ట్రోక్‌తో చనిపోయిన శ్యామ్‌సుందర్ కుటుంబానికి బుధవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి భద్రత, ఎక్స్ గ్రేషియా నుండి రావాల్సిన 8లక్షల రూపాయలను అందించారు. భార్య లిఖితకు రూ. 4లక్షలు, మైనర్ పిల్లలకు 1,37 వేల రూపాయలను అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎంతో భాద్యతతో కూడిందని, వాటిలో ఉన్న ఇబ్బందులు, ఒడిదుడుకులను అధిగమించి పనిచేసే యోధుడే ఒక మంచి పోలీసని తెలిపారు. అంతేకాకుండా మరణించిన పోలీసు కుటుంబాలకు చెందిన వారికి త్వరగా పెన్షన్‌తో పాటు ఉద్యోగం వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కరుణాకర్ డీసిపి స్పెషల్ బ్రాంచి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వంత నిధులతో బోరు ఏర్పాటు : చిలుక



ఉపేందర్ రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ పార్కులో నీటి కొరత సమస్యను గుర్తించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి తన సొంత నిధులతో నూతన బోరును ఏర్పాటు చేశారు. బోరునీటి సరఫరాద్వారా కాలనీవాసుల ఇబ్బందులు తొలగించడం జరిగిందని చిలక తెలిపారు. గ్రీన్‌హిల్స్ కాలనీ నివాసి రాఘవులు గుప్తా బోరుకు మోటార్‌ను ఏర్పాటు చేయించారని తెలిపారు. కాలనీకి బోరు ఏర్పాటు చేయించిన సందర్భంగా కాలనీవాసులు సిహెచ్. పుష్పలతరెడ్డి, ముప్పిడి లింగస్వామిగౌడ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, రేగట్టె నరసింహారెడ్డి, వెంకటేశ్వరరావు, దయాకర్‌రెడ్డి, రఘువీర్, సంగీత శ్రీనివాస్, బాలకృష్ణ, నరసింహయాదవ్, సుధాకర్‌గుప్తా, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరగా చేపట్టాలి : కార్పొరేటర్ శ్రీవాణి

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో సిసి రోడ్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. గుంతల రోడ్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టాలని కోరారు. గత ఎన్నికల ముందు మంజూరైన పనులు కూడా ఇంకా ప్రారంభించడం లేదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ నాగమణి, ఎఇ శ్వేతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జైపూరికాలనీలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో సప్తమ వార్షికోత్సవం

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ జైపూరికాలనీలోని శ్రీశివపంచయతన కాశీవిశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వములో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజారెడ్డి, తూర్పాటి చిరంజీవి, ఉప్పల సాయితేజ, ఉప్పల సాయికిరణ్, జైపురికాలనీ అధ్యకుడు యాదగిరివంశరాజ్, రమేశ్, మాధవి, మమత, ప్రసన్న, మీన తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్‌తో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. గత కొద్ది రోజులుగా ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారనే ఊహాగానాలతో బుధవారం పలువురు ఎమ్మెల్యేలు మాజీ సిఎం కెసిఆర్‌తో బేటి అయి పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, నియోజకవర్గం పరిధిలోని పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్‌తోనే తామంతా ఉంటామని పేర్కొన్నారు. పార్టీ మారే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.